

# గుళికలు
## రమానాథ్ కందాళ

| *గుళికల గురించి* | |
|---|---|
| *కుదురు రోగము:* | *అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము.* |
| *పదార్ధములు - పాళ్ళు:* | *మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి* |
| *వాడకము:* | *నెలకో గుళిక* |
| *వాడుక సూచన:* | *గొంతునకడ్డము పడకుండ మింగవలెను.* |
| *హెచ్చరిక:* | *వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది.* |
| *ప్రత్యేక హెచ్చరిక:* | *హెచ్చరికని చూడుడు.* |



## భక్తిమంతుడు

- రమానాథ్ కందాళ

సుబ్బులక్ష్మి విష్ణుసహస్రనామం సీడీ కార్లో ఉందికాబట్టి ఏదో వాదోడు గా ఉంటుంది.. డ్రైవింగ్‌చేస్తూ లాగించేయచ్చు. అది లేకుండా మటుకు తగుదునమ్మా అని పరధ్యాన్నంగా జ్ఞాపకమ్మీద మొదలెట్టేవనుకో.. ఇన్ఫినిట్ లూపులో చిక్కుకుంటావు.. రెండు మూడు శ్లోకాలున్నాయి.. వైకుంఠపాళీలో పాముల్లాగ.. అమాంతం మింగేసి మొదలెట్టిన చోట కంటే రెండు గళ్ళు వెనక్కి తీసుకొచ్చి పడేస్తాయి. గ్లోబులో మోటారుసైకిల్లాగ తిరుగుతూనే ఉంటావు కానీ ఎక్కడికీ పోవు. నామాలు వెయ్యే.. కానీ ఎంతకీ తెవల్దు. నాలిక పీకుతుంది. పెదిమెలు పొడి కడతాయ్. గొంతెండి పోతుంది. విశ్వరూపం కనబడుతుంది. శోషొచ్చి పడిపోతావేమో అన్నట్టయిపోయి చివరకి కాయేనవాచా అని గబగబా గొణిగేయాల్సి వొస్తుంది. అంచేత ఒళ్ళుదగ్గరపెట్టుకుని చదవాలి. కళ్ళుమూసుకోక్కల్లేదు. మూసుకోకూడదు కూడాను. డ్రైవింగు చేస్తూ కళ్ళు మూసుకోకూడదు. ప్రాణాలు నిలబెట్టే ప్రాథమిక సూత్రం. కరెక్టుగా చదివితే ఆఫీసు దగ్గర లెఫ్ట్ కొట్టేవేళకి హాయిగా గంట కొట్టినట్టు 'ఇతి శ్రీమహాభారతే' వొచ్చేస్తుంది.. దణ్ణవూ, దణ్ణంతో పాటు డాష్‌బోర్డు మీద దేవుణ్ణి ముట్టుకుని ముద్దూ.. ఇదంతా మామూలుగా జరిగిపోవాలి.. కానీ ఇవేళ ఈ ముష్టి ట్రాఫిక్కు.. అన్ని లేన్లలోనూ కార్లే.. ఒక దాన్నొకటి చిన్నచిన్న తోపులు తోసుకుంటూ.. ఏ వెధవో ఎక్కడో ఎవణ్ణో గుద్దేసుంటాడు ముందర.. ఒళ్ళ పొగరు. నిర్లక్ష్యం.. వెధవలు.. చేతిలో చక్రం ఉంది కదా అని ఇష్టవొచ్చినట్టు తిప్పుతారు. కుర్రవెధవలైతే మరీను. ఒళ్ళూ పై తెలీదు. అయినా వాళ్ళనెందుకులే అనుకోడం.. వాళ్ళ అమ్మలనీ నాన్నలనీ పట్టుకుని దులిపేయాలి. గుద్దేస్తే గుద్దేసేడు.. కాకపోతే ఇవాళే గుద్దేయాలా.. స్వామీ ఏవిటీ పరీక్ష?.. ఇవాళ నాకెంత ముఖ్యవైన దినవో సర్వజ్ఞుడివి నీకు తెలియదా. సరిగ్గ ఎనిమిది గంటలకి ఆఫీసులో ఉండాలే. నా పెర్‌ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్‌కి నేనే లేటయితే ఎలా?

బాసెంత చండశాశనుడో బాసాణాం బాసువి, నీకు తెలీదా. అసలే ఇండియన్ బాసు. తెలుగువాడు కూడాను. మన కీళ్ళూ నాళ్ళూ క్షుణ్ణంగా ఎరిగినవాడు.. తెల్లబాసైతే 'ఇవాళ కోడి కుయ్యలేదు సార్.. సారీ .. లేచేసరికి లేటయిపోయింది' అన్నా 'దట్సోకే..దట్సోకే..ఐ హోప్ యువర్ కోడీ ఈజ్ ఓకే..' అనగల సహృదయులు. మిష్టర్ రావ్ మటుకూ అలా కాదు. 'మై వైఫీజ్ గోయింగ్ త్రూ లేబర్..'అంటే 'థేంక్ గాడ్ ఇట్స్ యువర్ వైఫ్, నాట్ యు. ప్లీజ్ లాగిన్ ఫ్రం డెలివెరీ రూం' అన్నా అనగలడు. కాకపోతే భక్తుడేను. మొన్న గుళ్ళో కనబళ్ళేదూ, చూణ్ణట్టు నటించేడు కానీ. అసలింతకీ ముందేవైందో కనబడకుండా ఉంది. పేరుకుపోయిన కార్లనీ చూస్తుంటే గూడ్సుబళ్ళు కబుర్లు చెప్పుకుంటూ నత్త నడకలు నడుస్తూన్నట్టుంది. స్వామీ! సిగ్నలు ఇవ్వునాయనా.. సకల చరచర జగతిని సంకల్పమాత్రంతో నడిపించగలవే. ఈ వెధవ కార్లని ఒక్క తోపు తోయలేవా. 'అఖిలహేయ ప్రత్యనీక కల్యాణైకతాన స్వేతర సమస్త వస్తు విలక్షణానంత జ్ఞానానందైక స్వరూపా' అని ముకుళిత హస్తాలతో నీ ముందు నిలిచి అర్ధంకాని భాషలో ఎన్నిసార్లు వల్లించలేదు?.. ప్రయత్నం చేస్తే ఎందుకర్ధంకాదూ అంటావా.. ఏ ప్రయత్నవైనా నీ అనుగ్రహం వల్ల దానంతటది జరగాలికానీ నేను చేసేదేవుంది స్వామీ? పైగా ప్రగాఢ నమ్మకం ముఖ్యంకానీ ప్రతిపదార్ధ తాత్పర్యాలెందుకు? నీకు తెలీకనా..? ఏదో నన్ను వెర్రి వాణ్ణి చేసి గడుసు వాడివి కాబట్టి అలా ప్రశ్నలు వేస్తావు.. నీకు గుర్తుందా.. అలనాడు మద్రాసులో వీసా ఆఫీసు క్యూలో సెకెండ్ షో నుంచి సరాసరి వెళ్ళి నిలబడి, ప్రవేశం లభిస్తుందో లేదో అని పడిగాపులు పడుతూన్న నన్ను..నీ అనుగ్రహ ధారాఖ్య వనధికి పాత్రుణ్ణి చేసి.. ఎలాగో అలా ప్రవేశం లభింపజేసి.. వీసా దొరికింప జేసి.. టిక్కెట్టు కొనిపింపజేసి.. విమానవెక్కింపజేసి.. వినువీధుల విహరింపజేసి.. ఇదిగో ఇలా.. ఇక్కడ పడేసేవు. కాళ్ళక్యూలోంచి కార్లక్యూ లోకి. అంతా నీ దయ! నీ కటాక్షం! అసలు నీ కృపావీక్షణం నా మీద ఒకానొక క్షణంలో ప్రసరించింది అని చెప్పుకుంటే కళ్ళు పోతాయి. ఎల్లప్పుడూ నీ దయాపూర్ణ దృక్కులు నా మీద అవిశ్రాంతంగా ప్రసరిస్తూనే ఉన్నాయి. గుర్తుందా?..గ్రీన్‌కార్డప్పుడు మాత్రం.. నిన్ను నేనొదిలిపెట్టేనా.. నన్ను నువ్వొదిలిపెట్టేవా. డేట్లు కరంటవక నా మనసు తూట్లు పడుతూంటే నీ గుడి గోడకో ఇటుక సమర్పించుకుంటే అంతా సవ్యంగా జరిగిపోలేదూ. సిటిజెన్ షిప్పప్పుడో.. ఫింగరు ప్రింట్లకి పిలుపెంతకీ రాకపోతే, స్వామీ త్వమేవ అని నీకు సతీసమేతంగా సాష్టాంగపళ్ళేదూ.. పడ్డవాళ్ళందరికీ పన్లు అవుతున్నాయా.. నామీద నీకెందుకో ఇది. పలుసార్లనుకుంటే జింక్స్ కొట్టెస్తుంది. నువ్వు జింక్సాపగల సమర్ధువిడివేకానీ.. అయినా ఎందుకు నీకా శ్రమ? నా జాగ్రత్త నేను పడితే పోదూ. ఇంతవరకూ అన్నీ నీ దయ వల్ల సవ్యంగా జరిగేయి.. ఈ పెర్ఫార్మెన్స్ ఇవేల్యుయేషన్ కూడా సరిగ్గా జరిగిపోతే. నిన్నే రెస్టరూములోంచి మిష్టర్ రావ్ ఒస్తూంటే, నీ అనుగ్రహం వల్ల నాకూ అదేసమయానికి లఘుశంక కలగడం, నేను వెళ్ళడం, తలుపు దగ్గర ఎక్స్క్యూజ్ మీ అంటే ఎక్స్క్యూజ్ మీ అనుకోడం, నేను తలుపు బార్లా తీసి పట్టుకుంటే తను ఓ థాంక్యూ అనడం.. అంటూ నా వైపు చూసినవ్వడం.. సంశయం నాస్తి..ఇంత వరకూ అన్ని సంకేతాలూ సవ్యంగా ఉన్నాయి.. ఇదంతా నీ అనుగ్రహవే. ఈ దుర్మార్గపు ట్రాఫిక్కెలాగూ కదిలేలా లేదు. సైడు రోడ్డు తీసుకుంటాలే.. కానీ నాయనా! స్వామీ! ఆశ్రితమందారా! ఏదో ఒకటి చేసి మిష్టర్ రావునెలాగైనా లేట్ చేయించు తండ్రీ! చేయించేవనుకో....

✡✡✡

'హోప్ యూవ్ నాట్ బీన్ వైటింగ్ లాంగ్'

'నో మిష్టర్ రావ్..నాటెటాల్..'

'సారీ ఫర్ దీ డిలే.. ఐ హేడ్ ఎ స్మాల్ ఫెండర్ బెండర్ కమింగ్ టు వర్క్ .. నథింగ్ మేజర్..'

'ఐ యాం సారీ టు హియర్ దట్ మిష్టర్ రావ్.. హౌ డిడ్ ఇట్ హేపెన్.. ఇఫ్ ఐ మే ఆస్క్'

'ఓ.. నథింగ్..నథింగ్.. టూబీ ఆనెస్ట్.. ఐ హేడ్ థిస్ థింగ్.. థిస్ సీడీ ఆఫ్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మీస్ విష్ణుసహస్రనామం.. పార్వత్యువాచా దగ్గర పారవశ్యం పట్టలేక కళ్ళు మూసుకున్నాను.. యూనోహౌఇటీజ్.. తెరిచేసరికి ఫెండర్ బెండరయిపోయింది.. దట్స్ దీ డిలే..'

✡✡✡

అంతా వాడి లీల కాక మరోటని ఏ మొహం పెట్టుకుని అనను?!

